'సీమ'పై కాంగ్రెస్ చేసిందేమీ లేదు

- **అనుమతుల రద్దును తమ ఘనతగా సర్కారు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటు**
- **ఆదిత్యనాథ్‌దాస్‌ను నియమించి పరువు తీసింది**
- **రాయలసీమ ప్రాజెక్టుపై ఎన్జీటీలో కేసు వేసింది నేనే**
- **సామాజిక కార్యకర్త గవినోళ్ల శ్రీనివాస్ స్పష్టం**

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకానికి కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులను నిరాకరించడం చాలా సంతోషకరమని, అయితే ఇందులో కాంగ్రెస్ చేసిందేమీ లేదని సామాజిక కార్యకర్త, ఎన్జీటీ పిటిషనర్ గవినోళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. తామేదో ఘనత సాధించామంటూ కాంగ్రెస్ ప్రచారం చేసుకోవడాన్ని తప్పుబట్టారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కృష్ణా జలాల తరలింపు కోసం ఏపీ సర్కారు డీపీఆర్ తయారీ పేరిట అక్రమంగా ప్రాజెక్ట్ పనులను చేపట్టిందని, ఇదే విషయమై ఏపీ ప్రభుత్వంపై తానే ఎన్జీటీలో కేసు వేశానని తెలిపారు. దాని ఆధారంగానే ఆర్ఎల్ఐఎస్ ప్రాజెక్టుకు ఈసీ మంజూరు చేసేందుకు కేంద్ర పర్యావరణ శాఖ నిరాకరించిందని తెలిపారు. ఈ ఘనత తమదేనంటూ కాంగ్రెస్ పార్టీ, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఏపీ సీఎస్‌గా, నీటి పారుదల శాఖ ప్రధాన కార్యదర్శిగా రాయలసీమ ప్రాజెక్ట్‌ను అనుమతులకు విరుద్ధంగా పూర్తి చేసి, తుదకు ఎన్జీటీతో తీవ్రస్థాయిలో చీవాట్లు తిన్న ఆదిత్యనాథ్‌దాస్‌నే ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల సలహాదారుగా నియమించి తెలంగాణ పరువును ప్రభుత్వం తీసిందని మండిపడ్డారు. ఇకనైనా కృష్ణా నీటి వాటా త్వరగా తేల్చి తెలంగాణకు న్యాయం జరిగేలా కృషి చేయాలని, పెండింగ్‌లో ఉన్న పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో సర్వే పనులను అడ్డుకుంటున్న రైతులు

సర్వే పనులను అడ్డుకున్న గ్రామస్తులు

- **బాసర ట్రిపుల్ ఐటీ ఎల్కతుర్తి బ్రాంచ్ కోసం స్థల సేకరణ**

ఎల్కతుర్తి, మార్చి 16 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రం శివారులో బాసర ట్రిపుల్ ఐటీ బ్రాంచ్ ప్రారంభం కోసం అధికారులు చేస్తున్న సర్వే పనులను ఆదివారం చింతలపల్లి గ్రామస్తులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే... ట్రిపుల్ ఐటీ కోసం కొద్ది రోజులుగా అధికారులు ఎల్కతుర్తి శివారు మడిపల్లి రోడ్డులో గల సర్వే నంబర్ 381లోని 83 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్నారు. 100 ఎకరాలు అవసరమని అధికారులు విన్నవించడంతో చుట్టుపక్కలగల ప్రభుత్వ భూమిని అన్వేషిస్తున్నారు. పక్కనే గల చింతలపల్లిలో 385లో 16 ఎకరాలు, 392లో 40 ఎకరాలు, 389లో 30 ఎకరాలకు 50 ఏండ్ల క్రితమే అసైన్డ్ పట్టాలు స్థానిక రైతులకు ఇవ్వగా, వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. 100 ఎస్సీ కుటుంబీకులు ఈ భూమిపై ఆధారపడి జీవిస్తున్నాయి. బాసర ట్రిపుల్ ఐటీకి ఇట్టి సర్వే నంబర్లలో గల ప్రభుత్వ భూమిని సర్వే చేసేందుకు ఆదివారం రెవెన్యూ అధికారులు వెళ్లగా, స్థానిక రైతులతోపాటు ఎమ్మార్పీఎస్ నాయకులు అడ్డుకున్నారు. సోమవారం తహసీల్దార్‌తో మాట్లాడాలని అధికారులు రైతులకు విన్నవించగా, శాంతించారు.

నీళ్లన్నీ దోచేశాక టెలిమెట్రీలా?

ఏపీ జలదోపిడీని నిలువరించలేక చేతులెత్తేసి నేడు చిందులు

బీఆర్‌ఎస్ హయాంలోనే తొలి దశలో 18 చోట్ల టెలిమెట్రీల ఏర్పాటు • పోతిరెడ్డిపాడుపైనా అమరిక

- **సెన్సార్లను ట్యాంపరింగ్ చేసిన ఏపీ**
- **మాన్యువల్‌గానే ప్రాజెక్టుల వద్ద నీటి తరలింపు గణాంకాల సేకరణ**
- **నీళ్లను ఒడిసిపట్టడమే ఆంధ్రప్రదేశ్ జల దోపిడీకి అడ్డుకట్ట**
- **అదే శాశ్వత పరిష్కారమంటున్న సాగునీటిరంగ నిపుణులు**
- **పాలమూరు తదితర ప్రాజెక్టుల పూర్తిపై దృష్టిసారించాలని సూచనలు**

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లన్నీ ఖాళీ అయ్యేంతవరకూ నిర్లక్ష్యంగా వ్యవహరించిన రేవంత్‌రెడ్డి సర్కారు.. ఇప్పుడు టెలిమెట్రీల ఏర్పాటుకు పట్టుబడుతున్నామంటూ హడావుడి చేస్తున్నది. నీళ్లను ఒడిసిపట్టే పనులపై దృష్టిపెటకుండా, ఏపీకి విడిచిపెట్టి ఇప్పుడు చిందులు వేస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ఇరిగేషన్ శాఖ ఇంజినీర్లే విమర్శలు గుప్పిస్తున్నారు. కృష్ణా జలాల వినియోగానికి సంబంధించి కేఆర్ఎంబీ మొదటి విడతగా నాగార్జునసాగర్, శ్రీశైలం రిజర్వాయర్లు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ కలుపుకుని మొత్తంగా 18 చోట్ల టెలిమెట్రీలను ఏర్పాటుచేసింది. కానీ, వాటిని ఇప్పటివరకు అధికారికంగా అమల్లోకి తీసుకురాలేదు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీపై ఏర్పాటుచేసిన టెలిమెట్రీలు పనిచేయకుండా పోయాయి. ఇదేమని కేఆర్ఎంబీ అడగగా పిచ్చుకలు వాటిని ధ్వంసం చేసినట్టు ఏపీ గతంలో వెల్లడించడం గమనార్హం. అయితే, ఏపీనే ట్యాంపరింగ్ చేసిందని కేఆర్ఎంబీతోపాటు కేంద్రానికి సైతం అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) సాంకేతిక నిపుణులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసిన కేఆర్ఎంబీ గతంలోనే అధ్యయనం చేయించింది. టెలిమెట్రీల వ్యవస్థ ఏమాత్రం సవ్యంగా లేదని ఆ కమిటీ స్పష్టం చేసింది. పోతిరెడ్డిపాడు దిగువన 600 మీటర్ల వద్ద ఏర్పాటు చేయాల్సిన టెలిమెట్రీలను 12.26 కిలోమీటర్ వద్దకు మార్చారని, ఆ పాయింట్ సరికాదని, అక్కడ అమర్చిన నాన్ కాంటాక్ట్ రాడార్ వెలాసిటీ సెన్సర్ కూడా అంత అనువైనది కాదని స్పష్టం చేసింది. నాగార్జునసాగర్, శ్రీశైలం వద్ద తప్ప మిగిలిన టెలిమెట్రీలు కచ్చితమైన నీటిప్రవాహ సామర్థ్యాన్ని సూచించడం లేదని తెలిపింది. అనువైన ప్రాంతాల్లో, అనువైన సెన్సార్లను ఏర్పాటుచేయాలని కేఆర్ఎంబీకి సిఫారసు చేసింది. టెలిమెట్రీలు లేకపోవడంతో ఇప్పటికీ మాన్యువల్‌గానే డిశ్చార్జి కెపాసిటీని సేకరిస్తున్నారు. రెండవ దశలో టెలిమెట్రీలను ఏర్పాటుచేసే సమయంలోనే మొదటి దశలో ఏర్పాటుచేసిన టెలిమెట్రీల సెన్సార్లను కచ్చితమైన నీటి లెక్కలను గణించేందుకు అనువైన ప్రాంతాలకు మార్చాలని కేఆర్ఎంబీ నిర్ణయించింది. అయితే, నిధులు లేవని చెప్తూ ఏపీ ఎప్పటికప్పుడు దాటవేస్తున్నది. ఈ నేపథ్యంలో టెలిమెట్రీలు అందుబాటులోకి వచ్చే వరకూ ఇరు రాష్ట్రాల అధికారుల ఆధ్వర్యంలోని జాయింట్ ఇన్‌స్పెక్షన్ బృందాలు లెక్కగట్టిన నీటి గణాంకాలనే అధికారికంగా పరిగణనలోకి తీసుకోవాలని 9వ బోర్డు సమావేశంలో నిర్ణయించారు. నాటి నుంచీ జాయింట్ ఇన్‌స్పెక్షన్ టీమ్ అందజేస్తున్న గణాంకాలను ఎప్పటికప్పుడు కేఆర్ఎంబీ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు.

రెండోదశ కోసం సర్కారు హడావుడి

నీటి వినియోగం, నిల్వ సామర్థ్యం పెంపుపై దృష్టి పెట్టకుండా తెలంగాణ సర్కారు ఇప్పుడు 2వ దశ టెలిమెట్రీల ఏర్పాటుకు పట్టుబడుతుండటంపై తెలంగాణ నీటిరంగ నిపుణులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ఖర్చును ఏపీ చెల్లించకపోయినా మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందంటూ ప్రకటనలు గుప్పించడం చర్చనీయాంశంగా మారింది. శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు సంబంధించి పలు ఔట్‌లెట్లపై ఫేజ్-2 కింద మిగతా తొమ్మిదిచోట్ల టెలిమెట్రీలను ఏర్పాటుచేయాలని 18వ బోర్డు సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ సర్కారే టెలిమెట్రీల ఏర్పాటుకు కోసం మొత్తం నిధులను విడుదల చేస్తామని, ఏపీ నుంచి తరువాత వసూలు చేసుకుంటామని వెల్లడించడం గమనార్హం. ఈ నేపథ్యంలో కేఆర్ఎంబీ సైతం రూ.7 కోట్ల నిధులను విడుదల చేయాలని ఇరు రాష్ట్రాలకు లేఖ రాసింది. లేఖ రాసిన రెండు రోజుల వ్యవధిలోనే తెలంగాణ ప్రభుత్వం రూ.4.15 కోట్లు విడుదల చేసింది. అయితే, టెలిమెట్రీల ఏర్పాటుకు కృషి చేస్తున్నామంటూ కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు ప్రగల్భాలు పలుకుతుండటంపై తెలంగాణ నీటిరంగ నిపుణులు, ఇరిగేషన్ శాఖ ఇంజినీర్లు విమర్శలు గుప్పిస్తున్నారు. టెలిమెట్రీలను ఏర్పాటుచేసి లెక్కలు తీసుకోవడం తప్ప చేసేదేముందని ప్రశ్నిస్తున్నారు. నీటిని తరలించుకునే సామర్థ్యం, నిల్వచేసుకునే సామర్థ్యం ఉన్న నేపథ్యంలోనే ఏపీ సర్కారు ఇష్టారీతిన కృష్ణాజలాలను కొల్లగొడుతున్నదని, ఆ అవకాశం లేకపోవడం వల్లే తెలంగాణ తన వాటాను వినియోగించుకోలేకపోతున్నదని వివరిస్తున్నారు. ఏమాత్రం సోయి ఉన్నా ఏపీ తరహాలోనే నీటి నిల్వ సామర్థ్యం, వినియోగ సామర్థ్యాన్ని అత్యంత వేగంగా పెంచుకోవాలని, తద్వారానే ఏపీ జలదోపిడీని అడ్డుకట్ట వేయవచ్చని చెప్తున్నారు. టెలిమెట్రీల ఏర్పాటు ద్వారా లెక్కలు తీయడం, ఫిర్యాదులు చేయడం తప్ప తెలంగాణకు ఒరిగేదేమీ ఉండబోదని వివరిస్తున్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగిలిపోయిన కొద్దిపాటి పనులను పూర్తి చేసి ఉంటే నీటి తరలింపు, స్టోరేజీ సామర్థ్యం పెరిగి ఉండేదని గుర్తుచేస్తున్నారు. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయకుండా టెలిమెట్రీల ఏర్పాటు వెనక పరుగులు తీయడంపై అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు.

సర్కారు వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే..

కృష్ణా బేసిన్‌లో ప్రాజెక్టుల్లో 1010పైగా టీఎంసీలు ఈ ఏడాది వినియోగానికి అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే ఏపీ ఇష్టారాజ్యంగా నీటిని తరలిస్తున్నా, తెలంగాణ సర్కారు మాత్రం చోద్యం చూస్తూ వచ్చింది. కృష్ణా బోర్డుపై ఒత్తిడి పెంచకుండా, త్రిసభ్య కమిటీ సమావేశానికి డిమాండ్ చేయకుండా మౌనం వహించింది. తెలంగాణ ప్రభుత్వ వైఫల్యాల కారణంగానే ఈ ఏడాది ఇప్పటికే 76 శాతానికి పైగా జలాలను ఏపీ కొల్లగొట్టింది. ఎగువన పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ, దిగువ నాగార్జునసాగర్ కుడి కాలువ, పవర్‌హౌజ్ స్లూయిస్‌ల ద్వారా దాదాపు 450కుపైగా టీఎంసీల జలాలను తన్నుకుపోయింది. తెలంగాణ మాత్రం తన తాత్కాలిక వాటా 34% కంటే, తక్కువగా 24% జలాలను మాత్రమే వినియోగించుకున్నది. ఇప్పటికే నాగార్జునసాగర్, శ్రీశైలం రిజర్వాయర్లన్నీ డెడ్‌స్టోరేజీకి చేరువయ్యాయి. మరోవైపు, ఎడమ కాలువ కింద పంటలు ఎండిపోతుండటమే కాకుండా, హైదరాబాద్ తాగునీటి సరఫరా కూడా ప్రశ్నార్థకంగా మారింది. ఇదే విషయమై ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్, ఆయకట్టు రైతులు ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. రైతాంగం రోడ్ల మీదకు వచ్చి సాగు, తాగునీటి కోసం డిమాండ్ చేస్తున్నారు. ఆ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ పెద్దలు ఎదురుదాడికి దిగుతున్నారు.

మొదటి దశలో టెలిమెట్రీలు ఏర్పాటుచేసిన ప్రాజెక్టుల ఔట్‌లెట్లు

ఎమ్మార్పీ లిఫ్ట్, నాగార్జునసాగర్ డ్యామ్ డైవర్షన్ టన్నెల్, ఎన్ఎస్‌పీ హెడ్‌రెగ్యులేటరీ, ఎన్ఎస్‌పీ లెఫ్ట్‌కెనాల్ టన్నెల్, పాలేరు రిజర్వాయర్ ఎగువన ఎంట్రీ పాయింట్, పాలేరు రిజర్వాయర్ దిగువన, ఎన్ఎస్‌పీ లెఫ్ట్ కెనాల్ 101.36 కి.మీ వద్ద, కల్వకుర్తి సిస్టర్న్, శ్రీశైలం రిజర్వాయర్ 17/18 బ్లాక్, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ 12.265 కి.మీ వద్ద, హెచ్ఎన్ఎస్ఎస్ పంప్‌హౌజ్, జూరాల ప్రాజెక్టు, జూరాల రైట్ మెయిన్ కెనాల్ హెడ్‌రెగ్యులేటరీ, జూరాల లెఫ్ట్ మెయిన్ కెనాల్ హెడ్‌రెగ్యులేటరీ, జూరాల లెఫ్ట్ ప్యార్లల్ కెనాల్ హెడ్‌రెగ్యులేటరీ, భీమా లిఫ్ట్-1 స్కీమ్, నెట్టెంపాడు లిఫ్ట్ స్కీమ్, కోయిల్‌సాగర్ లిఫ్ట్ స్కీమ్

ప్రస్తుతం రెండవ దశలో ఏర్పాటు చేయాల్సిన ఔట్‌లెట్లు

పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ వద్ద శ్రీశైలం కుడి ప్రధాన కాలువపై, నాగార్జునసాగర్ కుడి కాలువ, సాగర్ ఎడమ కాలువ, పాలేరు రిజర్వాయర్ ఎగువన ఎడమ కాలువపై 136.35 కి.మీ వద్ద, సాగర్ ఎడమ కాలువ 101.36 కి.మీ ఏపీ బార్డర్ వద్ద, పోలవరం కెనాల్, ప్రకాశం బరాజ్ పశ్చిమ కాలువపై, ప్రకాశం బరాజ్ తూర్పు ప్రధాన కాలువపై, కర్నూలు-కడప (కేసీ) కెనాల్.

నేడు హెచ్‌డబ్ల్యూవో తుది ఫలితాలు

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ) : హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (హెచ్‌డబ్ల్యూవో) పోస్టుల భర్తీకి నిర్వహించిన రాత పరీక్షల తుది ఫలితాలను టీజీపీఎస్సీ సోమవారం విడుదల చేయనున్నది. 581 పోస్టుల భర్తీకి 2022 డిసెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల చేసిన కమిషన్, 2024 జూన్‌లో రాత పరీక్ష నిర్వహించింది. ఇప్పటికే జీఆర్ఎల్ విడుదల చేసి నాలుగు విడుతల్లో సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ పూర్తిచేసింది. నేటి ఫలితాల్లో ఉద్యోగాలు పొందినవారికి శాఖల వారీగా కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇస్తారు.

This may be published in Newspapers and TV from the day following the last date for withdrawal of candidature and upto two days before the date of poll

Format C-2

(For political party to publish in website, newspapers, TV)

Declaration about criminal antecedents of candidates set up by the party

(As per the judgment dated 25th September, 2018 of Hon'ble Supreme Court in WP(Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors.Vs.Union of India & Anr.)

Name of Political Party : **BHARAT RASHTRA SAMITHI**
*Name of Election : **BIENNIAL ELECTION TO TELANGANA LEGISLATIVE COUNCIL-2025**
Name of State/~~UT~~ : **TELANGANA**

1	2	3	4		5		
Sl. No.	Name of Constituency	Name of candidate	(A)Pending criminal cases		B) Details about cases of conviction for criminal offences		
			Name of Court, case No. & Status of the cases(s)	Sections of the Acts concerned & brief description of offence(s)	Name of Court & date(s) of orders(s)	Description of offence(s) & Punishment imposed	Maximum Punishment Imposed
1.	**BY THE MEMBERS OF LEGISLATIVE ASSEMBLY (MLAs)**	**Dr. DASOJU SRAVAN KUMAR.**	XVth ACMM Criminal Court Complex at Nampally CC.No.10404 of 2023 FIR NO. 304 of 2023 at Shainayath gunj Police Station	Sec.188 of IPC This is a Suo Motu Police case alleging that I was found along with the contesting candidate on 29th November 2023 at about 19.00 Hours at Sriram Colony, Begum Bazar, Hyderabad in violation of Model Code of Conduct during General Eelections-2023, Telangana.	**-NA-**	**-NA-**	**-NA-**

*In the case of election to Council of States or election to Legislative Council by MLAs, mention the election concerned in place of name of constituency.

Sd/-
SOMA BHARAT KUMAR
GENERAL SECRETARY
Bharat Rashtra Samithi

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

పంట భూములపై మరో పిడుగు

› మొదటిపేజీ తరువాయి...

గుండెల్లో పిడుగు పడ్డంత పనయింది. మొత్తం 638 మంది రైతుల నుంచి 821.11 ఎకరాలు సేకరించనున్నట్టు పేర్కొంది. ఇందులో 498మంది రైతులకు చెందిన 113ఎకరాల అసైన్డ్ భూములు కాగా పెద్దఎత్తున భూదాన్ భూములు కూడా ఉన్నాయి. నోటిఫికేషన్‌లో పేర్కొన్న భూములన్నీ పచ్చని పంటలు పండే మాగాణి భూములే కావడంతో రైతులు దిగ్భ్రాంతి చెందుతున్నారు. మరోవైపు ఇబ్రహీంపట్నం డివిజన్ కార్యాలయంలో భూమి ప్లాన్‌ను తనిఖీ చేసుకోవచ్చని ప్రభుత్వం నోటిఫికేషన్‌లో స్పష్టంచేసింది. భూమిని అభివృద్ధి చేసేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్టు వెల్లడించింది. కలెక్టర్ నుంచి ముందస్తు అనుమతి లేకుండా సదరు భూముల క్రయవిక్రయాలు, లీజు, ఇతర లావాదేవీలు చేపట్టవద్దని తేల్చిచెప్పింది. అభ్యంతరం ఉన్నవారు 60 రోజుల్లోగా జిల్లా కలెక్టర్, అధీకృత అధికారికి తెలపవచ్చని సూచించింది.

ఫ్యూచర్ సిటీ పేరు మీద!

కాంగ్రెస్ సర్కారు ఫ్యూచర్‌సిటీ పేరుతో రంగారెడ్డి జిల్లాలోని కందుకూరు మండలం తిమ్మాయిపల్లిలో 366 ఎకరాలు, మహేశ్వరం మండలం రావిర్యాల గ్రామంలో 275 ఎకరాలు భూములను సేకరించేందుకు ఇప్పటికే కలెక్టర్ నోటిఫికేషన్లు జారీచేశారు. తాజాగా యాచారం మండలం మొండిగౌరెల్లిలో 821 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చింది. ఇటీవల మొండిగౌరెల్లి ప్రజలు తమ గ్రామాన్ని ఫ్యూచర్‌సిటీలో కలపాలంటూ డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. కానీ ప్రభుత్వం మాత్రం తమ పొట్టకొట్టే నిర్ణయం తీసుకుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

నోటిఫికేషన్‌లో పేర్కొన్న భూమికి చుట్టుపక్కల మరికొంత భూమిని కూడా సేకరించేందుకు ప్రభుత్వ పెద్దలు ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ప్రతిపాదిత ఫ్యూచర్‌సిటీలో మొండిగౌరెల్లి గ్రామం లేకపోయినా అక్కడి భూమిని సేకరించడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతున్నది. అలాగే మంచాల మండలంలోని దాత్‌పల్లిని కలపడం ఎందుకని రైతులు ప్రశ్నిస్తున్నారు.

మొండిగౌరెల్లి, దాత్‌పల్లిలో అలజడి

ఫ్యూచర్‌సిటీలో తమ గ్రామాలు లేకున్నా భూమిని సేకరించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడం ఏంటని ఆ రెండు గ్రామాలైన మొండిగౌరెల్లి, దాత్‌పల్లి గ్రామాల్లో అలజడి మొదలైంది. ప్రతిపాదిత ఫ్యూచర్‌సిటీలో తమ గ్రామాలు లేకున్నా తమ భూములను ఎందుకు తీసుకుంటారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ పేరుతో దాని పరిధిలో ఉన్న గ్రామాల్లో ప్రభుత్వం భూములను తీసుకుంటున్నది. తమ గ్రామాన్ని ఫ్యూచర్‌సిటీలో కలపాలని మంత్రులు, ఎమ్మెల్యే, కలెక్టర్ విజ్ఞప్తి చేసినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పొలాల్లో పరిశ్రమలెందుకు?

ఫ్యూచర్‌సిటీని 30 వేల ఎకరాల్లో నిర్మిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గత ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం 14వేల ఎకరాలు సేకరించింది. ఆ భూముల్లోనే ఫ్యూచర్‌సిటీ ఏర్పాటుకు కాంగ్రెస్ సర్కారు యత్నిస్తున్నది. మరో 16 వేల ఎకరాలను ఫ్యూచర్‌సిటీ కోసం సేకరించాల్సి ఉందని చెప్తున్నది. అందులో భాగంగానే మొండిగౌరెల్లిలో 821 ఎకరాలు, కందుకూరు మండలంలోని తిమ్మాపూర్‌లో 600 ఎకరాలు, పంజాగూడలో 300 ఎకరాలను సేకరించేందుకు సర్కారు ప్రయత్నాలు చేస్తున్నది.

మ్యానిఫెస్టో హామీలను అమలుచేయాలి

- **స్టేట్ టీచర్స్ యూనియన్ డిమాండ్**

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన మ్యానిఫెస్టో హామీలను తక్షణమే అమలుచేయాలని స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్టీయూ) టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కాచిగూడలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొత్త పీఆర్సీ, పెండింగ్ డీఏలను తక్షణమే విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులపై ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి జీ సదానందంగౌడ్ మాట్లాడుతూ.. జీవో-317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, డీఎస్సీ-2003 టీచర్లకు పాత పింఛన్ అమలుచేయాలని కోరారు. సమావేశంలో ఆట సదయ్య, కృష్ణారెడ్డి, బీ రవి, జుట్టు గజేందర్, ఏవీ సుధాకర్, కరుణాకర్‌రెడ్డి, రాధ, జయలక్ష్మి పాల్గొన్నారు.

'కుల' నిపుణుల కమిటీలో ఫ్రెంచ్ ఆర్థికవేత్త!

- **థామస్ పికెట్టి నియామకంపై ప్రభుత్వ ఉద్దేశమేంటి?**
- **కుల వ్యవస్థపై అవగాహన ఉన్నదా?**
- **మన దేశంలో నిపుణులు కరువైపోయారా?**
- **కుల సంఘాలు, బీసీ నేతలు, తెలంగాణ మేధావుల ప్రశ్న**

హైదరాబాద్, మార్చి16 (నమస్తే తెలంగాణ): ఇంటింటి సర్వే (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే-2024) గణాంకాలను విశ్లేషించడానికి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాటుచేసిన నిపుణుల కమిటీలో ఫ్రెంచ్ ఆర్థికవేత్తకు చోటుకల్పించడంపై దుమారం రేగుతున్నది. బీసీ మేధావులు, కుల సంఘాల ప్రతినిధులు, పలు రాజకీయపక్షాల నుంచి విమర్శలొస్తున్నాయి. దేశంలో నిపుణులే లేరా? గోప్యంగా ఉంచాల్సిన గణాంకాలను విదేశీయుడికి ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం నిరుడు నవంబర్ 6 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని కుటుంబాల ఆర్థిక, సామాజిక, విద్య, రాజకీయ, ఉపాధి, ఉద్యోగ, కుల స్థితిగతులను అంచనా వేయడానికి ఇంటింటి సర్వే నిర్వహించింది. సర్వే నివేదికను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించి, ప్రత్యేక సమావేశంలో శాసనసభలో ప్రవేశపెట్టింది. సర్వే డాటాను విశ్లేషించడానికి తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బీ సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలో 11 మంది సభ్యుల స్వతంత్ర నిపుణుల బృందాన్ని ఏర్పాటుచేసింది. వైస్‌చైర్మన్‌గా ప్రొఫెసర్ కంచె ఐలయ్య, ప్రొఫెసర్ శాంతాసిన్హా, ప్రొఫెసర్ హిమాన్షు, డాక్టర్ సుఖదేవ్ థోరట్, నిఖిల్ డే, ప్రొఫెసర్ భంగ్యా భూక్యా, ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, ప్రొఫెసర్ జీన్‌డ్రేజ్, ప్రవీణ్‌చక్రవర్తితోపాటు ఫ్రెంచ్ ఆర్థికవేత్త థామస్ పికెట్టిని వర్కింగ్ గ్రూపు సభ్యులుగా నియమించింది. ఈ వర్కింగ్ గ్రూప్ సర్వే డాటాను విశ్లేషించి, నెలలోపు నివేదికను సమర్పించాలని సర్కారు నిర్దేశించింది. అయితే వర్కింగ్ గ్రూప్‌లో ఫ్రెంచ్ ఆర్థికవేత్త థామస్ పికెట్టిని నియమించడంపై తీవ్రస్థాయిలో దుమారం రేగుతున్నది.

సర్కారు ఆంతర్యమేంటి?

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కులగణన అధ్యయన కమిటీలో థామస్ పికెట్టి నియామకం వెనుక ప్రభుత్వం ఆంతర్యమేంటని బీసీ మేధావులు, కులసంఘాల ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. తెలంగాణలో సామాజిక న్యాయం, కుల నిర్మాణాలపై పరిశోధనలు చేసిన నిపుణులు ఎందరో ఉన్నారని గుర్తుచేస్తున్నారు. వారందరినీ పక్కనపెట్టి విదేశీ ఆర్థికవేత్తను తీసుకురావడంలో ప్రభుత్వ ఉద్దేశం ఏమిటని నిలదీస్తున్నారు. పశ్చిమ దేశాల ఆర్థిక అసమానతలే కేంద్రంగా థామస్ పికెట్టి పరిశోధనలు, అధ్యయనాలు చేశారని, ఆయనకు భారతీయ కుల వ్యవస్థపై పూర్తి అవగాహన లేదని చెప్తున్నారు. ప్రభుత్వ ఎజెండాను అమలు చేసేందుకే ఫ్రెంచ్ ఆర్థికవేత్తను నియమించారా? తెలంగాణ నిపుణులను ప్రభుత్వం పక్కనపెట్టడానికి కారణమేమిటి? కులగణన తుది నివేదిక పారదర్శకంగా విడుదలవుతుందా? అని బీసీ మేధావులు, కులసంఘాల ప్రతినిధులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. స్థానిక సంస్థల్లో, ఉద్యోగ, విద్యా రంగాల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పనపై ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళిక ప్రకటించదా? అని ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వం తక్షణం స్పందించాలి



థామస్ పికెట్టి నియామకంపై ప్రభుత్వం తక్షణం స్పందించాలని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆంతర్యమేంటని నిలదీశారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. కులగణన అధ్యయన ప్రక్రియ పారదర్శకంగా కొనసాగించాలని కోరారు. తెలంగాణ నిపుణులకు కమిటీలో ప్రాధాన్యం కల్పించాలని, నివేదికపై బహిరంగ చర్చ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన ఉద్దేశమేంటో చెప్పాలి.

- వకుళాభరణం

విదేశీయుడికి దేశ ప్రజల వివరాలా?



కుల సర్వే డాటా విశ్లేషణ కోసం నియమించిన వర్కింగ్ గ్రూప్‌లో ఫ్రెంచ్ ఆర్థికవేత్త థామస్ పికెట్టికి చోటు కల్పించడాన్ని బీజేపీ నేత అమిత్ మాలవీయ తప్పుబట్టారు. కాంగ్రెస్ పార్టీ జార్జ్‌సోరోస్ నీడలో ఉంటూ భారతదేశ సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసేందుకు కుట్రలు చేస్తున్నదని ఎక్స్ వేదికగా ఆరోపించారు. సున్నితమైన జనాభా డాటాను విదేశీయుడికి అప్పగించడం ఏమిటి? దేశంలో అర్హత కలిగిన నిపుణులు లేరా? అని నిలదీశారు.

- బీజేపీ నేత అమిత్ మాలవీయ